క్లుప్తంగా

రేపు దొమ్మేటి వెంకటరెడ్డి విగ్రహావిష్కరణ



కాకినాడ సిటీ: రౌతులపూడి మండలం ఎస్ఎన్ పట్టణం గ్రామంలో శెట్టి బలిజ జాతిపిత, విద్యాదాత దొమ్మేటి వెంకటరెడ్డి విగ్రహాన్ని మంత్రి వాసంశెట్టి సుభాష్ మంగళవారం ఆవిష్కరించనున్నట్టు అమలాపురం శెట్టిబలిజ సంఘ కన్వీనర్ కడలి రాంపండు తెలిపారు. కాకినాడలో ఈ మేరకు ఆయన ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ విగ్రహావిష్కరణకు ప్రజాప్రతినిధులు, సంఘ నాయకులు, పెద్దలు హాజరవుతున్నట్టు చెప్పారు.

'మార్ని'కి కవిసంధ్య ప్రతిభా పురస్కారం



మార్ని జానకిరామ చౌదరికి పురస్కారాన్ని అందిస్తున్న మల్లాడి కృష్ణారావు

బోట్‌క్లబ్: సాంస్కృతిక రంగానికి సంబంధించి కాకినాడ నగర సాహితీ స్రవంతి అధ్యక్షుడు మార్ని జానకిరామ చౌదరి కవిసంధ్య ప్రతిభా పురస్కారం అందుకున్నారు. పుదుచ్చేరి మాజీ మంత్రి మల్లాడి కృష్ణారావు, సంపాదకుడు శిఖామణి చేతులమీదుగా ఈ పురస్కారం అందజేసి ఘనంగా సత్కరించారు. యానాం గీతా భవన్‌లో కవిసంధ్య సాహితీ సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం కవిసంధ్య పత్రిక స్వర్ణోత్సవ సభ జరిగింది. అవార్డు అందుకున్న జానకిరామ చౌదరిని జోస్యుల కృష్ణబాబు, బొల్లోజు బాబా, అద్దేపల్లి జ్యోతి, మోహనరావు, చింతపల్లి సుబ్బారావుతో పాటు, పలువురు సాహితీవేత్తలు అభినందనలు తెలిపారు.

రేపు సివిల్ సర్వీసెస్ ఉద్యోగుల జిల్లా జట్ల ఎంపిక

నాగమల్లితోట జంక్షన్(కాకినాడ సిటీ): ఆంధ్రప్రదేశ్ రాష్ట్రస్థాయి సివిల్ సర్వీసెస్ ఉద్యోగుల పురుషులు, మహిళల క్రీడా పోటీలకు జిల్లా జట్ల ఎంపికను మంగళవారం కాకినాడ డీఎస్ఏలో నిర్వహి/స్తున్నట్లు డీఎస్‌డీఓ బి.శ్రీనివాస్‌కుమార్ ఆదివారం తెలిపారు. అథ్లెటిక్స్, బ్యాడ్మింటన్; బాస్కెట్‌బాల్, క్యారమ్స్, చెస్, క్రికెట్, ఫుట్‌బాల్, హాకీ, కబడ్డీ, లాన్‌టెన్నిస్, స్విమ్మింగ్, ఖో–ఖో, టేబుల్ టెన్నిస్, వెయిట్ లిఫ్టింగ్, యోగా, రెజ్లింగ్, పవర్ లిఫ్టింగ్, బెస్ట్‌ఫిజిక్‌లో ఎంపికలు జరుగుతాయని వివరించారు. ఆసక్తి ఉన్నవారు ఉదయం 8 గంటలకు డీఎస్ఏలో రిపోర్టు చేయాలని డీఎస్‌డీఓ కోరారు.

ముగిసిన టైపు పరీక్షల స్పాట్ వాల్యుయేషన్



సమావేశంలో మాట్లాడుతున్న శంకర్

బోట్‌క్లబ్: ఏపీ ప్రభుత్వ సాంకేతిక విద్యాశాఖ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన టైపు రైటింగ్ పరీక్షల స్పాట్ వాల్యుయేషన్ ముగిసిందని కాకినాడ ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ చీఫ్ ఎగ్జామినర్ పి.శంకర్ తెలిపారు. కాకినాడ సెంటర్ టైపు అండ్ షార్ట్ హ్యాండ్ ఇనిస్టిట్యూట్ అసోసియేషన్ అధ్యక్షుడు జి.శ్రీనివాస్ సహకారంతో స్పాట్ వాల్యుయేషన్ పూర్తి చేశామన్నారు. ఈ సందర్భంగా ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ, కంప్యూటర్ యుగంలో కూడా టైపు రైటింగ్, షార్ట్‌హ్యాండ్‌కు ఆదరణ పెరుగుతోందన్నారు. నవంబర్‌లో టైపు రైటింగ్ ఫలితాలు వెల్లడవుతాయన్నారు. కాకినాడ సెంటర్ టైపు అండ్ షార్ట్‌హ్యాండ్ ఇన్‌స్టిట్యూట్ అసోసియేషన్ అధ్యక్షుడు జి.శ్రీనివాస్ మాట్లాడుతూ, ఇటీవల నిర్వహించిన టైపు రైటింగ్ పరీక్షలకు రాష్ట్ర వ్యాప్తంగా అధిక సంఖ్యలో అభ్యర్థులు హాజరయ్యారన్నారు. నేటికీ టైపు రైటింగ్‌కు అభ్యర్థులు ఆసక్తి చూపుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు టీవీ రాజశేఖర్, దొరస్వామి, సుధీర్, శ్రీనివాస్, లక్ష్మీకుమారి, కుమార్ పాల్గొన్నారు.

సినిమాలు

ఆనంద్ సినిమాస్	:	వెనమ్, విశ్వం, వేట్టయాన్ లగ్గం
దేవి మల్టీప్లెక్స్	:	వెనమ్, లగ్గం, గ్యాంగ్‌స్టర్, విశ్వం
లక్ష్మీ	:	పొట్టేల్
సత్యగౌరి	:	వెనమ్
తిరుమల	:	వేట్టయాన్ ది హంటర్
సీఅండ్‌సీ	:	నరుడి బ్రతుకు నటన
సీఅండ్‌సీ 2	:	శ్వాగ్
పద్మప్రియ	:	దేవర
శ్రీప్రియ	:	మార్టిన్
సూర్య 1	:	వెనమ్
సూర్య 2	:	దేవర

చీకటి నగరం

- అనేక ప్రాంతాల్లో వెలగని వీధి దీపాలు
- అంధకారమైతే భయానక వాతావరణం
- మద్యం దుకాణాల వద్ద మందుబాబుల వీరవిహారం
- అయినా పట్టించుకోని అధికార యంత్రాంగం

బోట్‌క్లబ్: నగరపాలక సంస్థ స్థాయికి కాకినాడ ఎదిగినప్పటికీ పలు ప్రాంతాల్లో ఇప్పటికీ విద్యుద్దీపాలు సక్రమంగా ఏర్పాటు చేయలేని పరిస్థితుతి నెలకొని ఉంది. కొన్ని ప్రాంతాల్లో హైమాస్ట్ లైటింగ్‌తో కాంతులీనుతుండగా.. మరికొన్ని ప్రాంతాల్లో కరెంటు స్తంభాలకు లైట్లున్నా.. అవి వెలగకపోవడంతో అక్కడ అంధకారం అలుముకుంటోంది. చీకటిపడితే చాలు కొన్ని ప్రాంతాల్లోకి వెళ్లాలంటే ప్రజలు భయపడాల్సిన పరిస్థితి నెలకొంది. బయటకు అడుగుపెడితే చిమ్మ చీకట్లో ఏం జరుగుతుందోనని మహిళలు భయభ్రాంతులకు గురవుతున్నారు. తమ ప్రాంతంలో విద్యుద్దీపాలు వెలగడం లేదని ఫిర్యాదులు చేస్తే మినహా అధికారులు స్పందించిన వైనం దారుణమని నగర ప్రజలు వాపోతున్నారు.

మందుబాబులతో తిప్పలు


కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యుద్దీపాల నిర్వహణ మరింత అధ్వానంగా తయారైందని ప్రజలు గగ్గోలు పెడుతున్నారు. ప్రస్తుతం నగరంలో 36కు పైగా బ్రాందీ షాపులున్నాయని, ప్రభుత్వం వాటికి పర్మిట్ రూములు కూడా మంజూరు చేయడంతో ప్రస్తుతం చీకటిపడితే ఆయా బ్రాందీ షాపుల వద్ద గుంపులు గుంపులుగా మందుబాబులు చేరుతున్నారు. మద్యం సేవించి రోడ్డుపై వెళ్లే వారిని వారు అటకాయిస్తున్నారు. దీంతో అటువైపుగా వెళ్లాలంటే మహిళలు భయపడాల్సిన పరిస్థితి నెలకొంది. పూటుగా మద్యం సేవించి మందుబాబులు ప్రవర్తిస్తున్న తీరు చాలా దారుణంగా ఉంటుండటంతో, ప్రజలు చీకటిపడితే ఆయా రహదార్ల వైపు ప్రయాణించాలంటే జంకుతున్నారు.

నిర్వహణ అధ్వానం

కోట్లాది రూపాయలు ఆదాయం కలిగిన కాకినాడ కార్పొరేషన్.. ప్రస్తుతం వీధి దీపాల నిర్వహణ కూడా సక్రమంగా చేయలేకపోవడం ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. కార్పొరేషన్ పాలకవర్గం లేకపోవడంతో అధికారులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని ఆరోపణలు సైతం ఉన్నాయి. గతంలో అయితే కౌన్సిల్ సమావేశంలో విద్యుద్దీపాల మరమ్మతులు చేయకపోవడంతో పలుమార్లు కౌన్సిల్ సభ్యులు అధికారులను నిలదీసిన సందర్భాలు అనేకం ఉన్నాయి. కానీ ప్రస్తుతం కౌన్సిల్ పదవీకాలం ముగిసి ఏడాది గడుస్తున్నా ఎన్నికలు లేకపోవడంతో అధికారులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. కనీసం పోయిన విద్యుత్ బల్బులు కూడా మార్చకుండా ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నారు.

వెలగని లైట్లు

నగరంలోని టూటౌన్ ఓవర్ బ్రిడ్జి దిగువ నుంచి టౌన్ రైల్వేస్టేషన్ జవహర్ వీధి మీదుగా మెయిన్ రోడ్డును అనుకుని ఉన్న సూర్యారావుపేట, సాలిపేట ప్రాంతాలలో గంజాంవారి వీధి శివారు వరకున్న వీధి విద్యుద్దీపాల్లో 57 స్తంభాల లైట్లు వెలగడం లేదు. స్థానిక బాలాజీచెరువు సెంటర్ హైమాస్ట్ లైటింగ్‌లో రెండు దీపాలు వెలగడం లేదు. బ్రిడ్జిపైన విద్యుద్దీపాలు వెలగకపోవడం వలన వంతెన దిగువన రెండు వైపులా ఉన్న మార్గాల్లో చీకటి అలుముకుంది. స్థానిక పైడావారి వీధిలోను వీధి దీపాలు వెలగకపోవడంతో, ఆ ప్రాంతంలో ప్రయాణికులు నిత్యం భయంభయంగా ప్రయాణిస్తున్నారు. వేరే ప్రాంతాలకు వెళ్లి చీకటి పడిన తర్వాత మహిళలు బస్సులు, ఆటోలు దిగి తమ ఇంటికి వెళ్లాలంటే భయపడాల్సిన పరిస్థితి ఈ ప్రాంతంలో ఉందంటే, ఇక్కడ ఎంత చీకటి ఉందో అవగతమవుతుంది.



కాకినాడ నగరంలోని దంటువారివీధిలో వెలగని విద్యుద్దీపం



పైడావారి వీధిలో అలంకారప్రాయంగా ఉన్న విద్యుద్దీపం

ఎల్‌బీ నగర్ రోడ్డులో..

నగరంలోని ఎల్‌బీ నగర్ రోడ్డులో పలు విద్యుద్దీపాలు వెలగడం లేదు. ఇక్కడ నూతన మద్యం దుకాణం ఏర్పాటు చేయడంతో పాటు, పర్మిట్ రూమ్‌లు కూడా మంజూరు చేయడంతో మందుబాబులు వీరవిహారం చేస్తున్నారు. కొండయ్యపాలెం బ్రిడ్జి మీదుగా ప్రయాణించే వారితో ఈ రహదారి ఎప్పుడూ బిజీగా ఉంటుంది. పలు వీధి విద్యుద్దీపాలు వెలగక బ్రాందీ షాపు కారణంగా ఈ రహదారిపై ప్రయాణించాలంటే మహిళలు భయపడుతున్నారు. ఒంటరిగా ఈ రోడ్డుపై నడిచిరావాలంటే భయమేస్తోందని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మందుబాబులు రోడ్డుపై గలాటా సృష్టిస్తున్నారని, వారిని అదుపు చేయాలని పలువురు మహిళలు కోరుతున్నారు.

చీకటి పడితే భయమే..



తరచూ వీధి లైట్లు వెలగని కారణంగా చీకటిపడితే కొన్ని ప్రాంతాల్లోని వీధుల్లో నడిచి వెళ్లాలంటే భయపడాల్సిన పరిస్థితి ఉంది. వీధి దీపాలు నెలల తరబడి వెలగకపోయినా కార్పొరేషన్ అధికారులు పట్టించుకోవడం లేదు.

– సిరెడ్డి రమ్య, స్థానికురాలు

మద్యం దుకాణాలతో ఇబ్బందులు



బ్రాందీషాపులు ఉన్న ప్రాంతాల్లో కూడా విద్యుద్దీపాలు వెలగని కారణంగా ఈ రహదార్లలో ఒంటరిగా వెళ్లాలంటే భయపడాల్సి వస్తోంది. వీధి దీపాలు వెలగకపోవడంతో మద్యం సేవించిన వారు గుంపులుగా గలాటా సృష్టిస్తున్నారు.

– ఏలూరి రాణి, స్థానికురాలు

ప్రభుత్వ ఉద్యోగులకు ఐఆర్ ప్రకటించాలి

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు తక్షణం 42 శాతం ఐఆర్ ఇచ్చి, పీఆర్‌సీ ప్రకటించాలని పీఆర్టీయూ ఉపాధ్యాయ సంఘం డిమాండ్ చేసింది. పీఆర్టీయూ భవన్‌లో ఆదివారం నిర్వహించిన సమావేశంలో సంఘ జిల్లా అధ్యక్షుడు చింతాడ ప్రదీప్‌కుమార్ మాట్లాడుతూ, పెండింగ్ బకాయిలతో పాటు, పీఎఫ్ బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పోస్ట్‌కార్డు ఉద్యమం ద్వారా ఆయా సమస్యలను ప్రభుత్వానికి తెలపడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే 42 శాతం ఫిట్మెంట్ ఇస్తామని రాయదుర్గం మేధావుల సదస్సులో అప్పటి ప్రతిపక్ష నేత చంద్రబాబునాయుడు గత ప్రభుత్వంలో ప్రకటించారని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో సంఘ కార్యదర్శి నూకరాజు, డీవీవీ బాపిరాజు, పి.నాగేశ్వరరావు, సభ్యులు నరాల కృష్ణకుమార్, పడాల ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

30న జీపీటీలో జాబ్‌మేళా

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): జీపీటీ కళాశాలలో ఈ నెల 30వ తేదీన జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి జి.శ్రీనివాసరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్‌మేళాలో వివిధ ప్రైవేట్ కంపెనీల ప్రతినిధులు పాల్గొంటారని చెప్పారు. పదో తరగతి నుండి డిగ్రీ వరకు ఉత్తీర్ణులైన విద్యార్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించి, అర్హత బట్టి ఉద్యోగాలు కల్పిస్తారన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు తమ విద్యార్హతల సర్టిఫికెట్లతో ఉదయం 9 గంటలకు కళాశాలకు హాజరుకావాలని కోరారు. ఇతర వివరాలకు 90107 37998 నంబరులో సంప్రదించవచ్చన్నారు.



పోస్టర్‌ను విడుదల చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

స్టీల్ ప్లాంట్ పరిరక్షణకు రాష్ట్ర సదస్సు

వచ్చే నెల ఒకటిన విశాఖపట్నంలో నిర్వహణ

కాకినాడ సిటీ: విశాఖ స్టీల్ ప్లాంట్ పరిరక్షణకు నవంబర్ ఒకటో తేదీన విశాఖపట్నం అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో రాష్ట్ర సదస్సు జరుగుతుందని ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ప్రతినిధులు వెల్లడించారు. స్థానిక కచేరిపేటలో ఆదివారం ఈ మేరకు పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం గంగాసూరిబాబు మాట్లాడుతూ, 32 మంది త్యాగాలతో సాధించుకున్న విశాఖ స్టీల్ ప్లాంట్‌ను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రైవేటీకరణ చేయడం దుర్మార్గమన్నారు. విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు నినాదంతో ప్రజలు పెద్దఎత్తున ఉద్యమించారన్నారు. ఆందోళనలో 32 మంది పౌరులు, ముఖ్యంగా విద్యార్థులు ప్రాణాలకు కోల్పోయారని చెప్పారు. విద్యార్థులు స్కూళ్లు, కాలేజీలు, విశ్వ విద్యాలయాలు బహిష్కరించి ఆందోళనలో పాల్గొన్నారన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయాలని, విశాఖ స్టీల్ ప్లాంట్‌కు ఐరన్ హోల్డ్‌మైన్ స్టీల్ ప్లాంట్‌కు కేటాయించాలని, స్టీల్ ప్లాంట్‌లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని బహుళజాతి సంస్థలకు అమ్మే బదులు, ఆ సంస్థను కడపలో కొత్తగా ఉక్కు ఫ్యాక్టరీ పెట్టేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు శ్రీకాంత్, మణికంఠ, వాసు, సంజయ్, సాహిత్, చిన్ని, విపిన్‌కుమార్, జయరాం, గోపాల్, వంశీ, వెంకటేష్, సిద్దు తదితరులు పాల్గొన్నారు.

104 ఉద్యోగులకు వేతనాలు చెల్లించాలి



సమావేశంలో మాట్లాడుతున్న రాజ్‌కుమార్

కాకినాడ సిటీ: రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఆదివారం కాకినాడ జిల్లా సీఐటీయూ కార్యాలయంలో జిల్లా 104 ఉద్యోగుల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి చెక్కల రాజ్‌కుమార్ మాట్లాడుతూ, రాష్ట్రంలో 104 సర్వీస్‌లను అరబిందో యాజమాన్యం నిర్వహిస్తుందని, ఈ సంస్థ రెండు నెలలుగా వేతనాలు ఇవ్వకుండా ఉద్యోగులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తోందని ఆరోపసించారు. ఎంవోయూ నిబంధనల ప్రకారం ఈ సర్వీసులను నడపకుండా అడ్డగోలు వ్యవహారం చేస్తోందన్నారు. జిల్లా అధ్యక్షుడు కె శ్రీకాంత్ మాట్లాడుతూ, 104 సర్వీసులను ప్రభుత్వం నిర్వహించటం వల్ల సుమారు ఒక్కొక్క వాహనానికి రూ.60 వేల ప్రజాధనాన్ని ఆదా చేయవచ్చన్నారు. అంతేకాకుండా ఇంకా మెరుగైన సేవలను అందించవచ్చన్నారు. నెలల తరబడి వేతనాలు ఇవ్వకుంటే తామెలా బతకాలని ప్రశ్నించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి మేడిశెట్టి త్రిమూర్తులు మాట్లాడుతూ, ఈ సంస్థ నాలు గేళ్లుగా వేతనాలను రెండు, మూడు నెలలకోసారి చెల్లిస్తోందన్నారు. మూడేళ్ల నుంచి ప్రతి ఉద్యోగికి 30 శాతం చొప్పున ఇంక్రిమెంట్ కూడా వేయకుండా నిర్లక్ష్యం చేస్తోందన్నారు. ప్రభుత్వం చొరవ తీసుకుని ఈ సర్వీస్‌లను పీహెచ్‌సీల ద్వారా జిల్లా వైద్య విభాగం నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో సంఘ ప్రతినిధులు కె.వెంకటరావు, హరిప్రసాద్, ఆర్ ఇందుమతి, సీహెచ్ శ్రీనివాస్, ఎం సతీష్, జి.పాపారావు, వీరభద్రరావు, డీఈవో రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బాణసంచాతో వాయు, ధ్వని కాలుష్యం



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ప్రొఫెసర్ గంటా సత్యనారాయణ తదితరులు

కాకినాడ లీగల్: దీపావళి పండగ సందర్భంగా బాణసంచా కాల్చడం ద్వారా వెలువడే వాయు, ధ్వని కాలుష్యంతో కలిగే నష్టాలపై కాకినాడకు చెందిన ప్రముఖ ప్లాస్టిక్ సర్జన్ డాక్టర్ కె.విష్ణుమూర్తి కరపత్రాల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గతంలో జరిగిన బాణసంచా ప్రమాదాలను వివరించారు. స్థానిక పీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ అవగాహన కరపత్రాలను కేంద్ర ప్రభుత్వం అధీనంలోని బాబూ జగ్జీవన్‌రామ్ న్యాయ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ డాక్టర్ గంటా సత్యనారాయణ ఆదివారం ఆవిష్కరించారు. వాకర్లు, విద్యార్థులకు కరపత్రాలు అందజేశారు. న్యూఢిల్లీ వంటి మహా నగరాల్లో వాయు కాలుష్యం అత్యంత ప్రమాదకరంగా నమోదవుతోందని డాక్టర్ విష్ణుమూర్తి ఆందోళన వ్యక్తం చేశారు. దాని పరిసరాల్లో ఉన్న పంజాబ్, హర్యానా, ఉత్తర ప్రదేశ్ రాష్ట్రాల్లో పొలాల్లో వ్యర్థాలను తగులబెట్టడం ద్వారా వాయు కాలుష్యం పెరిగిపోయిందన్నారు. బాణసంచా కాల్చడం ద్వారా వచ్చే శబ్దాలు పిల్లలు. పెద్దల్లో ప్రమాకరంగా మారాయని, చెవి లోపల ఉండే టింపానిక్ మెంబ్రేన్, ఒస్సీ సెల్స్ దెబ్బతింటాయని వివరించారు. బాణసంచా కాల్చడం వల్ల ఎందరో ప్రాణాలు కోల్పోయిన ఘటనలు జిల్లాలో చాలా ఉన్నాయన్నారు. దీపావళిని బాణసంచాతో కాకుండా, దీపాల అలంకరణతో ఇంటిని లక్ష్మీ దేవాలయంగా అలంకరించుకుందామని పిలుపునిచ్చారు. పిండివంటల నైవేద్యాలతో, నూతన వస్త్రాలతో ఆనందాలను పంచుకోవాలన్నారు. కార్యక్రమంలో పారిశ్రామికవేత్త పాలిక దుర్గాప్రసాద్, చిలుకు గంగబాబు, సత్తి గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత మెగా కంటి వైద్య శిబిరం



వైద్య శిబిరంలో కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు, సిబ్బంది



కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ చంద్రశేఖరరావు

కాకినాడ రూరల్: కోరమండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ ఆధ్వర్యంలో వాకలపూడి గ్రామంలో ఆదివారం ఉచిత మెగా కంటి వైద్య శిబిరం నిర్వహించారు. సుమారు 2,500 మందికి వైద్య సేవలందించారు. కోరమండల్ ఆస్పత్రి వద్ద శ్రీకిరణ్ కంటి ఆస్పత్రి సహకారంతో ఏర్పాటు చేసిన ఈ వైద్య శిబిరాన్ని కోరమండల్ యూనిట్ హెడ్ శ్రీనివాసరావు, డీజీఎం జయగోపాల్, సంకురాత్రి ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ చంద్రశేఖరరావు, జిల్లా అదనపు వైద్యాధికారి సుబ్బరాజు ప్రారంభించారు, జిల్లా నలుమూలల నుంచి హాజరైన 1,400 మందికి ఉచితంగా కళ్లజోళ్లు, 350 మందికి కంటి శస్త్ర చికిత్సకు సిఫార్సు చేస్తూ, ఉచిత సేవలకు ఏర్పాట్లు చేశారు. యూనిట్ హెడ్ శ్రీనివాసరావు మాట్లాడుతూ, సీఎస్ఆర్ నిధులతో ప్రజారోగ్యం కోసం వైద్య సేవలు నిర్వహిస్తున్నామన్నారు. పెద్ద ఎత్తున కంటి వైద్య సేవలు అందించడాన్ని డాక్టర్ చంద్రశేఖరరావు అభినందించారు. కార్యక్రమంలో సంస్థ జీఎంహెచ్ఆర్ పద్మనాభం, ఫైనాన్స్ హెడ్ కృష్ణకిశోర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు మరకత మణికంఠకు ప్రత్యేక పూజలు

బోట్‌క్లబ్: అయ్యప్ప స్వామి జన్మ నక్షత్రమైన ఉత్తర సందర్భంగా సోమవారం స్థానిక రామారావుపేటలోని మరకత మణికంఠ గుడిలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు పీఠం వ్యవస్థాపకుడు సందమూరి వినోద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం స్వామివారికి అభిషేకం, సాయంత్రం ఊయల సేవ, దీపాలంకార సేవ జరుగుతాయని చెప్పారు.

ఇరుముడి నిర్ణయంపై హర్షం



సమావేశంలో మాట్లాడుతున్న అడ్డాల సత్యనారాయణ గురుస్వామి

బోట్‌క్లబ్: పవిత్రమైన 40 రోజుల దీక్ష చేసి, శబరిమలై విమానంలో వెళ్లే అయ్యప్ప స్వాములకు ఇరుముడి తీసుకువెళ్లేందుకు అడ్డంకులు తొలగించినందుకు పౌర విమానయాన శాఖ తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని అయ్యప్ప గురుస్వామి అడ్డాల సత్యనారాయణ తెలిపారు. ఆదివారం ఆయన ఇక్కడ విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. అయ్యప్ప భక్తులు శబరిమలై వెళ్లేటప్పుడు ఇరుముడి తీసుకు వెళ్లేందుకు పౌర విమానయాన శాఖ అనుమతించడంపై హర్షం వ్యక్తం చేశారు. కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు. రెండేళ్ల క్రితం తాము పీఠం స్వాములతో శబరిమలై యాత్రకు వెళుతున్నప్పుడు బెంగళూరు విమానాశ్రయంలో తమను ఇడుముడితో ప్రయాణించడాన్ని అడ్డుకున్నారని, అక్కడి వారితో పోరాడి ఎట్టకేలకు శబరిమలై యాత్రను పూర్తి చేశామని గుర్తుచేసుకున్నారు. ఇప్పుడు స్వాములు ఏ విధమైన ఆటంకాలు లేకుండా యాత్ర చేయవచ్చన్నారు. ఈ సమావేశంలో గురుస్వామి మొసలగంటి సురేష్ పాల్గొన్నారు.

విద్యార్థి ఉద్యమానికి రవిబాబు బాటలు



సభలో మాట్లాడుతున్న పూర్వ విద్యార్థులు

కాకినాడ సిటీ: ఎస్ఎఫ్ఐ మాజీ నాయకుడు, రైల్వేలో ఉన్నతాధికారిగా సేవలందించిన మంచాల రవిబాబు సంస్మరణ సభను ఆదివారం కాకినాడ సుందరయ్య భవన్‌లో పూర్వ విద్యార్థులు, ఎస్ఎఫ్ఐ నాయకుల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సభకు సీహెచ్ అజయ్‌కుమార్ అధ్యక్షత వహించారు. రవిబాబుతో పాటు, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షునిగా వ్యవహరించిన డాక్టర్ వీవీ సత్యనారాయణ.. రవిబాబు చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ రవిబాబు జిల్లాలో విద్యార్థి ఉద్యమానికి బాటలు వేశారన్నారు. రైల్వేలో ఉన్నత ఉద్యోగిగా పని చేస్తూ, సమాజ సేవ చేయడంలో ఆయన ముందుండే వారని గుర్తు చేశారు. పూర్వ విద్యార్థి సంఘ నాయకుడు, విశ్రాంత ఇంగ్లిష్ లెక్చరర్ కట్టా కృష్ణారావు మాట్లాడుతూ, రవిబాబు భారతీయ రైల్వేకి చేసిన సేవలు దేశానికే పేరు తెచ్చాయన్నారు. ఆయన రచించిన డొమెస్టిక్ మూమెంట్ ఆఫ్ డొమెస్టిక్ ఎక్స్‌పోర్ట్ కార్గొ కంటెయినిరైజ్డ్ ఆన్ సీ అనే పుస్తకం రైల్వే శాఖకు నేటికీ తలమానికంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ముని మురళి, పెద్దింశెట్టి రామకృష్ణ, టి.రాజా, మోర్త రాజశేఖర్, దువ్వా శేషుబాబ్జీ, అల్లూరి సురేంద్ర, తిరుమలశెట్టి నాగేశ్వరరావు, రవి, స్వర్ణలత, జాగా అప్పారావు, గంగా సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

కాకినాడ టౌన్ రైల్వే స్టేషన్ నుంచి బయలుదేరే రైళ్లు

ట్రైన్ నం.	స్టేషన్	గమ్య స్థానం	వెళ్లే సమయం	వచ్చే సమయం
17258	కాకినాడ పోర్టు	విజయవాడ (డైలీ మెము)	04.20	23.03
17267	కాకినాడ పోర్టు	విశాఖపట్నం (డైలీ మెము)	04.45	21.28
12755	కాకినాడ పోర్టు	భావనగర్ (భావనగర్)గురు	05.50	16.48
17206	కాకినాడ పోర్టు	సాయినగర్ (షిర్డీ) సోమ, బుధ, శని	06.10	18.55
17221	కాకినాడ పోర్టు	లోకమాన్య తిలక్ (ఎల్‌టీటీ) బుధ, శని	09.10	13.43
17655	కాకినాడ పోర్టు	పుదుచ్చేరి (సర్కార్) ఆది, బుధ, గురు	14.40	09.10
17644	కాకినాడ టౌన్	చెంగల్‌పట్టు (సర్కార్) సోమ, మంగళ, శుక్ర, శని	14.40	09.10
17250	కాకినాడ టౌన్	తిరుపతి డైలీ	15.15	11.45
17210	కాకినాడ టౌన్	బెంగళూరు (శేషాద్రి) డైలీ	17.25	06.45
12737	కాకినాడ పోర్టు	లింగంపల్లి (గౌతమి) డైలీ	19.20	06.58
07445	కాకినాడ టౌన్	లింగంపల్లి (స్పెషల్)సోమ బుధ, శుక్ర	20.10	07.10